సర్కారు బడి..

- తల్లిదండ్రులు.. ప్రభుత్వ ఉద్యోగులు
- వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో..
- ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న సార్లు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

6లో

ముంచెత్తింది..

కోహెడ, హుస్నాబాద్, బెజ్జంకి తదితర మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు వాన దంచికొట్టింది. దీంతో పలు గ్రామాల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లాయి. రోడ్లు, కాలనీలు జలమయమయ్యాయి. కోహెడలో మరోసారి వర్షం బీభత్సం సృష్టించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఇక్కడ 24 సెం.మీ వర్షపాతం నమోదైంది. పలు కాలనీల్లో ఇళ్లు, దుకాణాలు నీట మునిగాయి. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోహెడ మండలంలో 1191 రైతులకు చెందిన 1226 ఎకరాల్లో వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు నష్టం వాటిల్లింది. వరద ఉధృతికి పలు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

- పలు మండలాల్లో భారీ వర్షం
- పంట పొలాలు, ఇళ్లలోకి చేరిన వరద నీరు
- రాష్ట్రంలోనే అత్యధికంగా 24 సెం.మీ వర్షం
- పలుచోట్ల పర్యటించిన కలెక్టర్



కోహెడలో షాపింగ్ దుకాణాల ఎదుట చెరువును తలపిస్తున్న వరద నీరు..

కోహెడ, సెప్టెంబరు 4 : భారీ వర్షంతో కోహెడ మరోసారి అతలాకుతలమైంది. మోయతుమ్మెదు, రేణుకాఎల్లమ్మ, పిల్లి వాగుల వరద ఉధృతితో పలుచోట్ల లెవెల్ వంతెనలు మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బస్వాపూర్‌లో వాగు లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. బాడుగుల చెరువు మత్తడితో వరద ఉధృతి పెరిగి దుకాణాలు, పోచమ్మ వీధిలోని ఇళ్లలోకి నీరు చేరింది. కోహెడ చుట్టూ ఉన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. 22 ఇండ్లు కూలియినట్లు ఉన్నతాధికారులకు ప్రతిపాదించారు.

వరద నీటిలో చిక్కిన 8 మంది కార్మికులు..

జాతీయ రహదారి వంతెన నిర్మాణం పనులకు వచ్చి 8 మంది కార్మికులు బస్వాపూర్ వద్ద మోయ తుమ్మెద వాగునీటిలో చిక్కుకుపోయారు. వారంతా బిక్కుబిక్కుమంటూ గడిపారు. గ్రామస్తుల నుంచి సమాచారం అందుకున్న హుస్నాబాద్ ఏసీపీ సతీష్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి వెళ్లి వారిని రక్షించి బస్వాపూర్ రైతువేదిక వద్దకు తరలించారు. అలాగే బస్వాపూర్ గ్రామశివారులోని ఎరుకుల కులస్తులకు చెందిన ఐదు ఇళ్లలోకి వరద నీరు రాగా.. వారినీ రైతు వేదికకు తరలించారు.



కోహెడలో వరద నీరు చేరిన బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

కలెక్టర్, సీపీ సందర్శన..

కోహెడలోని వర్షం ప్రభావితమైన ప్రాంతాలను కలెక్టర్ ఎం.మను చౌదరి, పోలీస్ కమిషనర్ అనురాధ సందర్శించి బాధితులకు భరోసా కల్పించారు. నీటి మునిగిన కాలనీల ప్రజలతో వారు మాట్లాడుతూ ఎవరూ అధైర్య పడొద్దని ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. కూలిపోయిన ఇండ్ల వివరాలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి, ఏసీపీ సతీష్ తదితరులు ఉన్నారు.



కోహెడ- కరీంనగర్ రహదారిపై వరద ఉధృతి..



చిన్నకోడూరు మండలం అనంతసాగర్‌లో నీటమునిగిన పంట చేలు

హుస్నాబాద్ పట్టణంలో..



జలదిగ్బంధంలో హుస్నాబాద్ బస్టాండ్

హుస్నాబాద్, సెప్టెంబరు 4: హుస్నాబాద్ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దాదాపు 14.5 సెంటీమీటర్ల వర్షం కురువడంతో జనజీవనం స్తంభించింది. పట్టణంలోని సిద్దిపేట-హన్మకొండ ప్రధాన రహదారి జలమయమైంది. రోడ్డుకు ఇరువైపులా దుకాణాల్లోకి వరదనీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లింది. ఆర్టీసీ బస్టాండ్, పోలీస్‌స్టేషన్ జలదిగ్బంధమయ్యాయి. నాగారం రోడ్డు, సాయినగర్ కాలనీలోని ఇళ్లలోకి నీరు చేరింది. ఎల్లమ్మచెరువు, కొత్తచెరువులు మత్తడి దూకుతున్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఎస్సై తోట మహేష్, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ వరద ప్రాంతాల్లో తిరుగుతూ పరిస్థితి సమీక్షించారు.



చిన్నకోడూరు మండలం చౌడారం- మేడిపల్లి కల్వర్టు వద్ద కొట్టుకు పోయిన రోడ్డు

దారులు ధ్వసం.. నిలిచిన రాకపోకలు..

చిన్నకోడూరు, సెప్టెంబరు 4 : వర్షానికి మండలవ్యాప్తంగా చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు మత్తళ్లు దూకుతున్నాయి. చెర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీలోకి నీరు చేరగా సుమారు 20 కుటుంబాలు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇబ్రహీంనగర్‌లో ఇళ్లలోకి నీరు చేరింది. వరద ప్రవహంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 125 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు ఏవో జయంత్ కుమార్ తెలిపారు.

బాధితులకు మైనంపల్లి పరామర్శ



బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న మైనంపల్లి

నంగునూరు, సెప్టెంబరు 4 : అక్కేనపల్లి జిల్ల కుంటకు వరద ఉధృతి పెరగడంతో గ్రామంలోని బుడగజంగాలకాలనీ నీట మునిగింది. దీంతో 28 కుటుంబాలను సమీప రైతు వేదికలోకి తరలించారు. బాధిత కుటుంబాలను బుధవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మైనంపల్లి హన్మంతరావు పరామర్శించి వారికి స్వయంగా భోజనాలు వడ్డించారు. అనంతరం నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాల తప్పిదాల వల్లే ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నామన్నారు. హైడ్రాపై కొందరు రాజకీయం చేస్తున్నారని, దేవుడు కరుణించి వర్షాలు కురిపిస్తున్నాడని తెలిపారు. వర్షాలు, వరదలని రాజకీయం చేయొద్దన్నారు. ఎవరికి చేతనైనంత వారు రాజకీయాలకు అతీతంగా సాయం చేయాలని కోరారు. నష్టపోయిన 28 కుటుంబాలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి డబుల్ బెడ్‌రూం ఇళ్లు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అక్కేనపల్లిలోని కలెక్టర్ పర్యటన..

నంగనూరు మండలం పరిధి అక్కేనపల్లి గ్రామ శివారులోని ముంపునకు గురైన బుడగజంగాల కాలనీని కలెక్టర్ మను చౌదరి, సీపీ అనురాధ సందర్శించి వారిని పునరావాస కేంద్రానికి తరలించారు. ముంపు బాధితులకు వైద్య పరీక్షలు చేపిస్తామని, ఆహారం ఇతర అవసరాలకు ఇబ్బంది కాకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. 23 కుటుంబాలకు చెందిన 53 మంది వరద బాధితులు ఆశ్రయం పొందుతున్నారని తెలిపారు. బాధితులకు శాశ్వత గృహాలు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. బాధితుల పూర్తి వివరాలతో పూర్తి నివేదిక పంపాలని తహసీల్దార్ సరితకు సూచించారు.



నంగునూరు మండలం అక్కెనపల్లిలో నీటిలో మునిగిన బుడగజంగాల కాలనీ గుడిసెలు..



మత్తడి దూకుతున్న హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు



హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద వరదనీరు



చిన్నకోడూరు మండలం చెర్లఅంకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీని పరిశీలిస్తున్న ఎంపీడీవో జనార్ధన్, ఎంపీవో సోమిరెడ్డి



కోహెడ పోచమ్మ వీధిలో పారుతున్న వరద నీరు..

బెజ్జంకిలో ఉధృతంగా...

బెజ్జంకి, సెప్టెంబరు 4 : మండలంలోని ఈదుల వాగు, పోతారం, కల్లేపల్లి కల్వర్టుల పైనుంచి ఉధృతంగా వరద నీరు ప్రవహించడంతో మండల కేంద్రానికి రాకపోకలు నిలిచాయి. గాగిల్లాపూర్ ఎస్సీ కాలనీలోకి వరద చేరడంతో నిత్యావసర వస్తువులు నీటమునిగాయి. బాధిత పది కుటుంబాలను గ్రామంలోని మహిళా సంఘ భవనంలోకి తరలించారు. చిలాపూర్, పెరుకబండలో మూడు ఇళ్లు కూలగా, తోటపల్లిలో పిడుగుపాటుకు పాడి గేదే మృతి చెందింది. పోతారం కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురైంది. డీపీవో దేవకీదేవి అధికారులతో కలిసి గ్రామాల్లో పర్యటించి జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు.



ఈదుల వాగు కల్వర్టుపై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

తీరని నష్టం..

అన్నదాతలకు తప్పని కష్టం

- భారీ వర్షాలకు పలు మండలాల్లో పొలాల మునక

6 లో

వర్షం వచ్చింది.. కష్టాలు తెచ్చింది -8లో

నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందాలి

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 4 : వర్షాలకు పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం అందేలా చూడాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు తెలిపారు. బుధవారం నియోజకవర్గ స్థాయి వ్యవసాయ అధికారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. నష్ట పోయిన ప్రతి రైతుకూ రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పద్మ, పరుష రాంరెడ్డి, గీత, జయంత్, నరేష్, శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

రూ.లక్ష విరాళం..

వరద బాధితులకు సిద్దిపేట ఐఎంఏ అసోసియేషన్ వైద్యులు విరాళం అందజేశారు. ఈ మేరకు రూ.లక్ష విలువ గల చెక్కును బుధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు భాస్కర్‌రావు, సతీష్, శ్రీనివాస్, రవికాంత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన..

సిద్దిపేట రూరల్, సెప్టెంబర్ 4; నారాయణరావుపేట మండలం జక్కాపూర్, మల్యాల గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంటలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు బుధవారం పరిశీలించారు. అలాగే గోపులాపూర్‌లోని తురుకవానికుంట కట్ట బాధితుల పంటలనూ పరిశీలించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ సిద్దిపేట నియోజకవర్గంలో 700ల ఎకరాల్లో పంట నష్టం జరినట్లు తెలిపారు. బాధిత రైతు దేవయ్యకు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు.

మట్టి విగ్రహాల పంపిణీ..

ఆధ్యాత్మికత సేవలకు, దాతృత్వానికి నెలవు సిద్దిపేట అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని గాంధీ చౌరస్తాలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఆయన మట్టి వినాయకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమర్‌నాథ్ సేవా సమితి సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



రైతు దేవయ్యకు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

శాంతియుతంగా పండుగలు జరుపుకోవాలి

- జిల్లా కలెక్టర్ మను చౌదరి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 4: ప్రజలు శాంతియుతమైన వాతావరణంలో పండుగలు జరుపుకొనేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మను చౌదరి సూచించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, సీపీ అనురాధతో కలసి ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వినాయక మండపాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనానికి వెళ్లే రూట్లలో అవసరమైన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు. పనులను ఆర్డీవోలు ప్రతిరోజూ పర్యవేక్షించాలన్నారు. సీపీ అనురాధ మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద, నిమజ్జనం జరిగే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ గరీమా అగర్వాల్, ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, జిల్లా పంచాయతీ అధికారి దేవకిదేవి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, డీఆర్డీవో జయదేవ్ ఆర్యా, మత్స్య శాఖ అధికారి సురేష్ బాబు, నీటిపారుదల శాఖ అధికారి రమేష్, ఫైర్ డిపార్ట్మెంట్ పరమేశ్వర్, విద్యుత్ శాఖ చంద్ర మోహన్, ఆర్అండ్‌బీ ఈఈ రాములు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మను చౌదరి

రాయపోల్‌లో రాతి గణపతి

వెయ్యేళ్ల క్రితం నాటి విగ్రహం

రాయపోల్, సెప్టెంబరు 4: భారీ రాతి గణపతి అరుదు. అలాంటిది ఓ మారుమూల గ్రామంలో భారీ రాతి విగ్రహం పూజలందుకుంటున్నది. ఈ విగ్రహం ఎప్పటిది అనేది ఇదమిద్ధంగా తెలియకపోయినప్పటికీ సుమారు వెయ్యేళ్ల నాటిదని చరిత్రకారులు చెబుతున్నారు. రాయపోల్‌లో పురాతన కాలం నాటి భారీ రాతి గణపతి విగ్రహం ఎలాంటి ఆలయం లేకుండా భూమిపై ఉండగా.. కొందరు దాతలు ఆలయాన్ని నిర్మించారు. ఆలయం వెలుపల భారీ రాతి ధ్వజస్తంబం ఉన్నది. ఈ స్తంబంపై పురాతన లిపితో శాసనం రాసి ఉన్నది.

అన్ని విశిష్టతలే..

సుమారు ఐదడుగులకన్నా ఎత్తుగా ఉన్న ఈ భారీ గణపతి విగ్రహం తల దువ్వి పాపట తీసినట్లు, చేట చెవులు కుండలాలతో అలంకరించి ఉన్నాయి. రెండు పొట్టి దంతాలు, రెండు చేతులకు సర్పాలు చెక్కి ఉన్నాయి. కుడి చేతిలో విరిగిన దంతం, ఎడమ చేతితో తొండానికి కుడుము అందిస్తున్నట్లుగా ఉంది. మెడలో గజ్జెల దండ కనిపిస్తున్నది. పొట్ట మీద నాగబంధం ఉంది. సాధారణంగా వినాయక విగ్రహాలలో ఒక దంతం విరిగి పొట్టిగా, మరొకటి పెద్దగా ఉంటుంది. కానీ, ఈ వినాయకుడికి రెండు పొట్టి(విరిగిన) దంతాలు ఉండడం విశేషం. రావిప్రోలుగా పిలువబడిన ఈ గ్రామంలో గావుండ హవిన కొడుకు జువ్విరడ్డి అనే వ్యక్తి గణపతి విగ్రహ ప్రతిష్ట చేసినట్లుగా, కల్యాణి చాళుక్య చక్రవర్తి ఆహవనమల్ల 1వ సోమేశ్వరుని ఏలుబడి కాలంలో వేసిన క్రీ. శ. 1048నాటి శాసనంలో ఉంది. ఈ శాసనంలో జువ్విరడ్డి ప్రతిష్టించిన విగ్రహం ఇదే అయ్యుండొచ్చని, లలితాసనంలో కనిపిస్తున్న శిల్పం శైలిని బట్టి 8, 9 శతాబ్దాల కాలంనాటి రాష్ట్ర కూటుల నాటిది అయి ఉంటుందని కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. పురావస్తు శాఖ అధికారులు ఈ విగ్రహంపై లోతుగా పరిశోధనలు జరిపితే మరింత సమాచారం తెలిసే అవకాశం ఉంది.



రాయపోల్‌లోని భారీ రాతి గణపతి విగ్రహం

బెస్ట్ టీచర్లు

రాష్ట్రస్థాయిలో ముగ్గురు.. జిల్లాస్థాయిలో 48 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక..



రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు సురేష్‌కుమార్, రూపారాణి, క్రాంతికుమారి

కొండపాక, సెప్టెంబరు 4 : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఎంపికకాగా, జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా 48 మంది ఎంపికయ్యారు. కొండపాక మండలం సిరసనగండ్ల ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రూపా రాణి, చిన్న కోడూరు మండలం రామంచ ప్రాథమిక పాఠశాలలో ఎస్ జీటీగా పనిచేస్తున్న వైవీ సురేష్‌కుమార్, ములుగు మండలం సింగన్నగూడ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న క్రాంతి కుమారి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులగా ఎంపికయ్యారు. వీరిని గురువారం రవీంద్రభారతిలో జరిగే వేడుకల్లో సన్మానించనున్నారు. అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా నంగునూరు పీజీహెచ్‌ఎం రామస్వామి, చిన్నకోడూరు పాఠశాల హెచ్‌ఎం లక్ష్మయ్య, సిద్దిపేట రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి (కూటిగల్), రామ్ రెడ్డి (సలాక్‌పూర్), శ్రీనివాస్‌రెడ్డి (సింగన్నగూడ), పి.శ్రీనివాస్ (సిరసనగండ్ల), రాజిరెడ్డి (మాచిన్‌పల్లి), శివకుమార్ (గోనెపల్లి), ముంద్రాతి అనిత (ఇందిరానగర్), శ్రీనివాస్ (నారాయణరావుపేట), నర్సింహులుగౌడ్ (బేగంపేట), మంజుల (కేజీబీవీ రాఘవపూర్), బాల్‌లింగం (చందులాపూర్), మహేందర్‌రెడ్డి (తిమ్మారెడ్డిపల్లి, బిక్షపతి (గుడికందుల), నాగరాజు (గుండారెడ్డిపల్లి), మురళీధర్ (వెంకటరావుపేట), వెంకటేశ్వర్లు (ముస్త్యాల), శ్రీనివాస్ (నర్మెట), సిద్దయ్య (మర్కుక్), సావిత్రి (నెమ్టూర్), సైదులు (మునిగడప), సత్య విజయ (లకుడారం), బాల మల్లయ్య (కొండపాక), భవిత (మోడల్ స్కూల్ కొండపాక), నరేష్, ఫిజికల్ డైరెక్టర్ (ఖాజీపూర్) రామచంద్రం (కుకునూరుపల్లి) , దేవరాజు (నాంచార్‌పల్లి), రత్లావత్ (వెంకటాపూర్), శ్రీనివాస్ (శేరిపల్లి), శోభారాణి (గజ్వేల్), బానోతు మోహన్ (అక్కన్నపేట), శ్రీనివాస్ (ధర్మాజీపేట), రమాదేవి (కొత్తపల్లి), కనకారావు (ఎర్రవల్లి), సుమన్ చందకాన్ (మక్త), విజయ్ కుమార్ (ఆకునూరు), మల్లయ్య (అప్పాయిపల్లి), స్వప్న (బందారం), కరుణ శ్రీ (సీతారాంపల్లి తండా), గిరిబాబు (గురువన్నపేట), రామచంద్రారెడ్డి (పెద్దమాసాన్‌పల్లి), లత (ఎల్లాయగూడ), జ్యోతి (తోటపల్లి), వసంత (గిరిపల్లి), రేణుక (తలవారిపల్లి), దుర్గారెడ్డి (పెద్ద మాసాన్‌పల్లి) ఎంపికయ్యారు. వీరందరినీ సిద్దిపేటలో గురువారం మధ్యాహ్నం జరిగే కార్యక్రమంలో సన్మానిస్తారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం..

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 4 : సమాజంలో గురువు స్థానమే వేరని.. అదొక గొప్ప అనుభూతి అని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బుధవారం ఆయన సిద్దిపేట పబ్లిక్ సర్వెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.



సర్కారు బడి..

- తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగులు
- వారి పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో..
- ఒక్క స్కూల్‌లోనే 58 మంది పిల్లలు
- ఆదర్శంగా తీర్చిదిద్దుతున్న సార్లు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 4 : "మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్య దేవోభవ".. అని తల్లిదండ్రుల తర్వాత స్థానమిచ్చి గురువును గౌరవిస్తాం. అజ్ఞాన పొరలను తొలగించి జ్ఞానదీప్తిని వెలిగించేవాడే ఆచార్యుడు. దేవుడు, గురువు పక్కపక్కన నిలుచుంటే నేను గురువుకే నమస్కరిస్తానన్నారు కబీర్ దాస్. ఎందుకంటే తనకు ఆయన భగవంతుడు అని చెప్పింది గురువేనని అంటారాయన. దైవం కంటే మిన్నగా గురువును ఆరాధించే సంస్కృతి మనది. ఆదియుగం నుంచి ఆధునిక కాలం వరకు ఆచార్యుడే ఆరాధ్యుడు. మనకోసం మనం బతకటంలో గొప్పేముంది? ఇతరుల కోసం సమాజ హితం కోసం బతికితేనే కదా జీవితానికి అర్థం పరామార్థం అని ఉపాధ్యాయ వృత్తిని దైవకార్యంగా భావిస్తున్నారు కొంతమంది ఉపాధ్యాయులు.

ఇందిరానగర్ హైస్కూల్లో ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు

సాధారణంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వాసుపత్రులంటే ఓ రకమైన అభిప్రాయం ఉంటుంది. ముఖ్యంగా సర్కార్ బడుల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు సంకోచిస్తుంటారు. కానీ సిద్దిపేటలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందుకు భిన్నం. పేరుకు ప్రభుత్వ పాఠశాల అయినా, కార్పొరేట్ విద్యను అందిస్తారు ఇక్కడి అధ్యాపక బృందం. కొన్ని సంవత్సరాలుగా వందల్లో ఉన్న విద్యార్థులు వేలలోకి చేరారు. సామాన్య, మధ్యతరగతి వాళ్లే కాదు ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ఈ పాఠశాలకు పంపించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ఒక్క స్కూలులోనే 58 మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇందులో 12 మంది అధ్యాపక వృత్తిలో ఉన్న వాళ్ల పిల్లలు చదువుకుంటున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఎల్లం ఇద్దరు పిల్లలు ప్రకృతి, కీర్తిక 6వ తరగతి చదువుతున్నారు. 8వ తరగతిలో ప్రధానోపాధ్యాయుడు సురేష్ కొడుకు విఘ్నేష్, మరొక ప్రభుత్వ పాఠశాల ఉద్యోగి కొడుకు లిఖిత్ ఉన్నారు. 9వ తరగతిలో సాంఘిక సంక్షేమ పాఠశాల అధ్యాపకురాలు రజిత కూతురు రూపశ్రీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న జగదీశ్వరాచారి కూతురు శ్రేష్ట, మోడల్ స్కూల్లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు కూతురు హర్షిని, ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దత్తాద్రి కొడుకు సాయిచరణ్ చదువుతున్నారు. 10వ తరగతిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు వెంకట్ కొడుకు భార్గవ్‌రాజ్, మరో ప్రభుత్వ అధ్యాపకుడు దశరథం కూతురు అక్షర, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న హిమబిందు కూతురు ధనలక్ష్మి, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో అధ్యాపకుడిగా పనిచేస్తున్న శ్రీనివాస్ కూతురు వేదవిజ్ఞ ఉన్నారు. వీరే కాకుండా వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారి పిల్లలు 58 మంది ఈ పాఠశాలలో చదువుతున్నారు. ప్రైవేట్ స్కూళ్లను కాదని ప్రభుత్వ బడిలో చేర్పించి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇందిరానగర్ అధ్యాపక బృందం సరైన ప్రణాళికలతో కార్పొరేట్ విద్యను విద్యార్థులకు అందిస్తున్నారు. పాఠశాల చదువు తర్వాత ఉన్నత చదువులు చదువుతూ కార్పొరేట్ స్కూల్స్‌లో చదివిన విద్యార్థులతో పోటీ పడుతున్నారు.



పాఠశాల గేటుకు ఏర్పాటు చేసిన నో అడ్మిషన్స్ ఫ్లెక్సీ (ఫైల్)



డిజిటల్ క్లాసులు వింటున్న విద్యార్థులు



ఇందిరానగర్ పాఠశాల

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాలి

- దశరథం, ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నేను బడిబాటలో గ్రామాల్లోకి వెళ్లి పిల్లలను బడికి పంపాలని అడిగినప్పుడు మీ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపుతారు. మా పిల్లలను గవర్నమెంట్ బడికి పంపాలా? అని అడిగారు. నాకు నిజమే కదా అనిపించినా ఇద్దరు కూతుర్లను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేర్పించా. నా కూతురు అక్షరను నేను పనిచేసే మర్రిముచ్చాల స్కూలులో 6,7,8 తరగతులు చదివించా. ఆ తర్వాత నాకు ట్రాన్స్‌ఫర్ అయ్యాక 9వ తరగతికి ఇందిరాగర్ స్కూలుకు మార్చాను. ప్రస్తుతం 10వ తరగతి చదవుతుంది. చదివే సత్తా ఉన్నవాళ్లు ఏ స్కూళ్లో అయినా చదువుతారనేది నా అభిప్రాయం.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి నా వంతుగా..

- వెంకట్, ప్రభ్యుత్వ ఉపాధ్యాయుడు



ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయడానికి నా వంతు గా నా కొడుకును కూడా సర్కార్ బడిలోనే చదివించాలి అనుకున్న. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు నేను పనిచేసే బద్దిపడగ దగ్గర ఊరతండా పాఠశాలలో చదివించా. 6వ తరగతి నుంచి ప్రస్తుతం పదవ తరగతి ఇందిరానగర్ స్కూలులో చదివిస్తున్న. తల్లిదండ్రులకు ప్రభుత్వ బడుల మీద నమ్మకం రావాలంటే ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ బడిలోనే చదివించాలి.

గర్వంగా ఉంది, బాధ్యత పెరిగింది

- ప్రభాకర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, ఇందిరానగర్ హైస్కూల్



ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులకు మా పాఠశాల విశ్వాసం కలిగిస్తుంటే గర్వంగా ఉంది. వారి పిల్లల భవిష్యత్‌ను మా చేతుల్లో పెట్టారు. దీంతో మరింత బాధ్యత పెరిగింది. వారికి అంచనాలకు తగ్గట్టుగా మా ఉపాధ్యాయ బృందం మంచి ప్రణాళికతో పని చేసి మంచి ఫలితాలను తీసుకొస్తాం

ఫీల్డ్ ఆఫీసర్ డిప్యుటేషన్‌ను రద్దు చేయాలి


- అల్లాదుర్గం ఎస్‌బీఐ ఎదుట రైతుల ఆందోళన

అల్లాదుర్గం, సెప్టెంబరు 4: అల్లాదుర్గం ఎస్‌బీఐలోని ఫీల్డ్ ఆఫీసర్‌ను మరో బ్యాంకుకు డిప్యుటేషన్‌పై బదిలీ చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తూ బుధవారం ఎస్‌బీఐ ఎదుట రైతులు ఆందోళన చేపట్టారు. రుణమాఫీ కోసం తాము వ్యయప్రాయసలు ఓర్చి బ్యాంకుకు వస్తే ఫీల్డ్‌ఆఫీసర్ పెద్దశంకరంపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లడంతో తమకు ఇబ్బందులు తప్పడం లేదని వాపోతున్నారు. రైతులు బ్యాంకు వద్ద క్యూ కడుతుంటే మరొక బ్యాంకుకు బదిలీ చేయడం ఏంటని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు.



అల్లాదుర్గం ఎస్‌బీఐ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు









హత్నూర మండలం కొన్యాలలో వర్షపు నీటిలో మునిగిన పత్తిపంట



బద్దిపడగ వద్ద సర్వీస్ రోడ్డు దాటుతున్న స్థానికులు



కంగ్టి మండలంలో కుప్పగా వేసిన చోటే మొలకెత్తుతున్న పెసర మెదలు

తీరని నష్టం

అన్నదాతలకు తప్పని కష్టం


కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. వాగులు, చెరువులు పొంగిపొర్లాయి. వరద ఉధృతికి రహదారులు కొట్టుకుపోయాయి. పలుచోట్ల ఇళ్లు.. కరెంటు స్తంభాలు కూలాయి. ఇక వేల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు నిలిచాయి. భారీ వర్షాలు.. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్నదాతలకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పత్తి పంటలు ఎర్రబారుతున్నాయి. ఇక పెసర, మినుము పంటలు మొలకెత్తుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేతికొచ్చిన పంటలు వర్షార్పణమవడంతో అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు.

- భారీ వర్షాలకు పలు మండలాల్లో పొలాల మునక
- మొలకెత్తుతున్న పెసర, మినుము.. ఎర్రబారుతున్న పత్తి
- పలుచోట్ల పిడుగుపాటుకు గేదెలు మృతి, కూలిన ఇళ్లు
- ఆందోళనలో రైతాంగం..
- క్షేత్రస్థాయిలో కానరాని వ్యవసాయ అధికారులు!!

వట్‌పల్లి/హత్నూర/కంగ్టి/మునిపల్లి/ఝరాసంగం/అక్కన్నపేట/హుస్నాబాద్/చేర్యాల/మిరుదొడ్డిసెప్టెంబరు4:వట్‌పల్లి మండలంలో చేతికొచ్చిన మినుము పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి. పంటలను బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. అత్యధికంగా మినుము, పత్తి పంటకు నష్టం వాటిల్లినట్లు రైతులు అధికారులకు విన్నవించారు. నష్ట పరిహారం అందించి తమను ఆదుకోవాలని వారు కోరారు. హత్నూర మండలంలో పత్తి పంట పెద్ద మొత్తంలో దెబ్బతిన్నది. ఒంపు ప్రాంతాల్లో నీరు నిలిచి మొక్కలు కుళ్లిపోతున్నాయి. అయితే మిగతా మొక్కలకు తెగులు సోకే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయశాఖ ధికారులు పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పంటల సంరక్షణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కంగ్టి మండంలోనూ పలు గ్రామాల్లో పెసర, మినుము పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాశులు చేద్దామని పెసర పంట కోయగానే వర్షం ప్రారంభమైంది. రైతులు పెసర మెదళ్లను ఒకచోట వేసి తాటిపత్రి కవర్లతో కప్పి ఉంచారు. ఇప్పుడు చూస్తే పెసర మెదళ్లు మొలకెత్తాయి. దెగుల్‌వాడి గ్రామానికి చెందిన రైతుపోగులపీర్‌రెడ్డి మూడెకరాల్లో వేసిన పెసర పూర్తిగా మొలకెత్తింది. కంగ్టిలో కుర్మె మన్నారెడ్డి తన మూడెకరాల్లో వేసిన పెసర పనికి రాకుండాపోయింది. మునిపల్లి మండలంలో మొత్తం 38వేల ఎకరాల విస్తీర్ణం ఉండగా ఇందులో 32వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. భారీ వర్షాలకు పత్తి పంట దెబ్బతిన్నది. ఝరాసంగంతో పాటు మండల పరిధిలోని తుమ్మన్‌పల్లి, నర్సాపూర్, బొప్పన్‌పల్లి, మాచూనూర్, గుంతమర్పల్లి, చీలమామిడి, ఏడాకులపల్లి తదితర గ్రామాల్లో సుమారు 40 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఎకరానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టారు. వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇంత జరిగిన ఇప్పటి వరకు సంబంధితశాఖ అధికారులు వచ్చి రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వలేదని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.



బద్దిపడగ వద్ద పొలంలోకి చేరిన ఇసుక మేటలు



ఝరాసంగం మండలం మాచూనూర్ శివారులో నీట మునిగిన పత్తిపంట



హుస్నాబాద్‌లో పిడుగుపాటుకు మృతిచెందిన గేదె



అక్కన్నపేట మండలం కేశవపూర్ గ్రామంలో..

కానరాని అధికారులు..!

ప్రభుత్వం దెబ్బతిన్న పంటలను గుర్తించి నివేదిక ఇవ్వాలని ఆదేశించినా మునిపల్లి మండల వ్యవసాయ అధికారులు రైతువేదికలకే పరిమితమయ్యారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. రూ.2లక్షలకు పైబడిన రుణమాఫీ విషయంలో పత్రాలు స్వీకరించడంలో ఏఈవోలు నిమగ్నమై ఉన్నారని చెబుతున్నారు. గత నెల మునిపల్లి ఏవో అనితారెడ్డి సస్పెండ్ అవ్వగా ఆమె స్థానంలో ఇంకా ఎవరికి బాధ్యత అప్పగించలేదు. పత్తి పంట పడిపోతున్న విషయం తమ దృష్టికి రాలేదని, తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏడీఏ సత్యనారాయణను తెలిపారు. ఒక్క మునిపల్లి అనే కాదు ఉమ్మడి జిల్లాలోని అనేక మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పిడుగుపాటుకు రెండు గేదెలు మృతి

హుస్నాబాద్ పట్టణంలో బుధవారం తెల్లవారుజామున పిడుగుపాటుకు సావు చంద్రయ్యకు చెందిన గేదె మృతి చెందింది. దాదాపు రూ.1.50లక్షల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. అక్కన్నపేట మండలం కేశవాపూర్‌లో పిడుగుపడి గన్నెబోయిన రాజేశంకు చెందిన గేదె మృతిచెందింది. గేదె మృతితో రూ.70 వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు తెలిపారు.

కూలిన ఇళ్లు.. ఓ ఘటనలో మహిళకు తీవ్రగాయాలు

వర్షానికి పెంకుటిల్లు కూలి మహిళకు తీవ్రగాయాలైన సంఘటన బుధవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం ఖాజీపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుబ్బారెడ్డి, భార్య, తల్లితో కలిసి జీవిస్తున్నాడు. పాత ఇల్లు కావడంతో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ఘటనలో తల్లి కౌసల్య కాలు విరిగింది. స్థానికుల సహాయంతో ఆమెను దుబ్బారెడ్డి కుటుంబీకులు ఆసుపత్రికి తరలించారు. చేర్యాలలోని అంబేడ్కర్ నగర్ కాలనీకి చెందిన భూమిగారి జనార్దన్ ఇల్లు మంగళవారం రాత్రి నేల కూలింది. వర్షాల కారణంగా ప్రమాదకరంగా మారడంతో జనార్దన్ కుటుంబీకులంతా బంధువుల ఇంట్లో నిద్రించడంతో ప్రాణాపాయం తప్పింది. మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, కౌన్సిలర్ ముస్త్యాల తారయాదగిరి రెవెన్యూ అధికారులకు సమాచారం అందించడంతో పరిశీలించారు. ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారు.



నంగునూర్ వద్ద రోడ్డుపైకి నీళ్లు రావడంతో స్థానికుల తిప్పలు



భారీ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన మోయతుమ్మెద వాగు వద్ద సర్వీసు రోడ్డు



భారీ వర్షానికి కోతకు గురైన మిట్టపల్లి సర్వీస్ రోడ్డు



మొలకెత్తుతున్న పెసర మెదలు

తేలుకాటుకు మహిళ మృతి



లావణ్య (ఫైల్)

మద్దూరు, సెప్టెంబరు 4 : తేలుకు కాటుకు గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మహిళ మృతిచెందింది. ఈ సంఘటన మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల మేరకు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడ్వటూర్‌కి చెందిన దండుగుల లావణ్య(26) సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాఖ్‌పూర్‌లోని ఓ రైతుకు చెందిన పత్తిపంటలో కలుపు తీయడానికి ఆటోలో కూలీలతో కలిసి వచ్చింది. చేనులో కలుపు తీస్తుండగా ప్రమాదవశాత్తు తేలు కాటు వేసింది. గమనించిన తోటి కూలీలు లావణ్యను మద్దూరులోని పీహెచ్‌సీకి, అక్కడి నుంచి చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భర్త మహిపాల్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



రాయపోల్ మండలం ఎల్కల్‌లో స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేయిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

రాయపోల్, సెప్టెంబరు 4: టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎప్పటికప్పుడు దాడులు చేస్తున్నప్పటికీ అక్రమ రేషన్ బియ్యం దందా ఆగడం లేదు. తాజాగా రాయపోల్ మండలం ఎల్కల్‌లో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన పబ్బ మల్లేశం కిరాణాషాపులో సుమారు 70 బస్తాల బియ్యం దొరికినట్లు తెలిసింది. పట్టుబడిన బియ్యాన్ని బేగంపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కిలో అల్ప్రాజోలం పట్టివేత

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 4 : సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రం వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై బుధవారం ఓ వ్యక్తి నుంచి 1.010 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నట్లు సంగారెడ్డి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎండీ నజీర్ పాష తెలిపారు. కంది వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సదాశివపేటలోని హట్కర్‌పేటకు చెందిన మొమిన్‌పేట మహేష్ అనుమానాస్పదంగా నడుచుకుంటూ కనిపించాడన్నారు. అనుమానం వచ్చి అతన్ని తనిఖీ చేయగా 1.010 కిలోల అల్ప్రాజోలం పట్టుబడ్డట్లు తెలిపారు. పట్టుబడిన అల్ప్రాజోలం విలువ సుమారు రూ.10లక్షల వరకు ఉంటుందని పేర్కొన్నారు. సదాశివపేటకు చెందిన ప్రధాన సరఫరాదారుడు లింగన్నగారి రఘుగౌడ్ పరారీలో ఉన్నాడని చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐలు కె.దిలీప్‌రెడ్డి, పి.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా భూములను కాపాడండి

- ఎంపీ డీకే అరుణను కలిసిన వక్ఫ్ భూబాధిత రైతులు



హైదరాబాద్‌లో ఎంపీ డీకే అరుణకు వినతిపత్రం అందజేస్తున్న కోహీర్ వక్ఫ్ భూబాధిత రైతులు

కోహీర్, సెప్టెంబరు 4 : సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలానికి చెందిన పలువురు వక్ఫ్ భూముల బాధిత రైతులు బుధవారం హైదరాబాద్‌లో జాయింట్ పార్లమెంట్ కమిటీ సభ్యురాలు, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణను కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. కొన్నేళ్లుగా వక్ఫ్ పేరుతో తమకు భూములను స్వాధీనం చేసుకున్నారని రైతులు ఆమె ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. తమ భూములు వక్ఫ్ పరిధిలో ఉన్నాయని, భూ క్రయవిక్రయాలు లేకుండా చేశారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యను జాయింట్ పార్లమెంట్ కమిటీ ఎదుట వినిపించాలని వారు అభ్యర్థించారు. అనంతరం ఎంపీకి వినతి పత్రం అందజేశారు. ఎంపీ అరుణను కలిసిన వారిలో రైతులు వెంకటేశ్వర్‌రెడ్డి, వీరరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, దశరథ్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బోగ బస్వరాజ్, రవీందర్, బస్వరాజు స్వామి, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ..

- ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు

ఆరోగ్య మిత్రల విన్నపం

మెదక్ కల్చరల్, సెప్టెంబరు 4: ఎన్నో ఏళ్లుగా చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్నామని, తమ సమస్యలను పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి విచ్చేసిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు ఆరోగ్యమిత్రలు విన్నవించుకున్నారు. 2007లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవలు అందించాలనే ఉద్దేశంతో నియమించారని, అప్పటినుంచి ఎన్నో వ్యయ ప్రయాసలను ఓర్చి ఉద్యోగ బాధ్యత నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరోగ్యశ్రీ పరిధిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంతో ఆయుష్మాన్ భారత్ సేవలను కూడా అందించడంలో తమ పాత్ర కీలకంగా మారిందన్నారు. అయినా తమను పట్టించుకోవడం లేదని వారు వాపోయారు. ఇటీవలే ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవోకు సమ్మె నోటీసు ఇచ్చినపుడు వ్యాధుల కాలం దృష్ట్యా మానవతా దృక్పథంతో వాయిదా వేయడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా ఉద్యోగులను డాటా ప్రాసెసింగ్ ఆఫీసర్లుగా గుర్తించాలి, ఉద్యోగులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనీ వేడుకున్నారు. ఒకవేళ తమ సమస్యలు పరిష్కరించకుంటే త్వరలోనే పూర్తి స్థాయి సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ అంతోళ్ల సురేష్, జిల్లా అధ్యక్షుడు బ్రహ్మం తదితరులు ఉన్నారు.



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఉద్యోగులు

గజ్వేల్ మార్కెట్‌యార్డును ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్

వంటేరు నరేందర్‌రెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 4: గజ్వేల్ మార్కెట్‌యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్‌రెడ్డి అన్నారు. గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా వంటేరు నరేందర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ నేపథ్యంలో సాదాసీదాగా బాధ్యతలు స్వీకరించినట్లు పేర్కొన్నారు. అధిష్ఠానం ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకోగా, త్వరలోనే పెద్దఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు. రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ, గజ్వేల్ మార్కెట్ యార్డును రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం లక్ష్యంగా కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. తమ నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. వారి మార్గదర్శకంలో వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని వివరించారు. కాగా వైస్ చైర్మన్‌గా సర్దార్ ఖాన్, డైరెక్టర్‌గా ఉప్పల శ్రీనివాస్‌గుప్త, సముద్రాల హరినాథ్‌గుప్త, మహంకాళి శ్రీనివాస్‌గుప్త, శ్రీనివాస్‌గౌడ్, నరసింహారెడ్డి, డాక్టర్ వహీద్, యాదయ్య, నల్ల భానుప్రియ, రామాగౌడ్, నర్సింలుగౌడ్, వెంకటస్వామిలు బాధ్యతలు స్వీకరించారు. మార్కెట్ కమిటీ సెక్రటరీ జాన్ వెస్లీ పాలకమండలిచే బాధ్యతల స్వీకారం చేయించారు.



మంత్రి దామోదర రాజనర్సింహతో గజ్వేల్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు



గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నరేందర్‌రెడ్డి

మంత్రులను కలిసిన ఏఎంసీ పాలకవర్గ సభ్యులు

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ సర్ధార్‌ఖాన్ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని వారి నివాసంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డితో కలసి ఆయనను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ పాలక వర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావును మర్యాదపూర్వకంగా కలువగా, వారు శుభాకాంక్షలు తెలిపారు.

గరీబోళ్లకు అన్యాయం చేస్తే సహించం

- హైడ్రాను స్వాగతిస్తాం..
- రాజకీయం చేసి పేదల ఇళ్లు కూల్చితే సహించబోం
- అనుమతులిచ్చిన వారిపై ముందు చర్యలు తీసుకోవాలి
- వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి
- మెదక్ పార్లమెంట్ సభ్యుడు రఘునందన్‌రావు

దుబ్బాక, సెప్టెంబరు 4: 'కబ్జాకు గురైన భూములను రక్షిస్తామంటే సంతోషిస్తాం.. హైడ్రాను రాష్ట్రం మొత్తం జిల్లాల్లో అమలు చేస్తే మరీ సంతోషపడుతాం.. కానీ గరీబోనికి అన్యాయం చేసే పనిని తాము సహించబోం' అని మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బడాబాబులకు విక్రయంచగా మిగిలిన కోకాపేటలోని భూములను పేదలకు పంచి, అందులో ఇళ్లు కట్టించిన తరువాతే హైడ్రా పేరుతో ఇండ్లు కూల్చివేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదైన ఒక కేసు విషయంలో ఆయన బుధవారం దుబ్బాక మున్సిఫ్‌కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోర్టు బయట విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అక్రమ కబ్జాలపై కొరడా ఝుళిపిస్తామంటే తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ దానివెనుక రాజకీయం చేసి, పేదల ఇండ్లను కూల్చివేస్తే తాము సహించబోమన్నారు. గరీబోళ్ల ఇండ్లు కూల్చివేయడం కంటే, వాటికి అనుమతినిచ్చిన అధికారులపై ముందు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేగాక తప్పుడు ధ్రువపత్రాలను చూసి, ఇంటిరుణం ఇచ్చిన బ్యాంకర్లపై చర్య తీసుకుని, వారి రుణం రద్దు చేయాలన్నారు. ముందుగా అధికారులు అనుమతినివ్వకుంటే, ఇలాంటి సమస్య తలెత్తేది కాదన్నారు. 30 ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకుని అక్కడే జీవిస్తున్న వారికి ఎలాంటి నోటీసులూ ఇవ్వకుండా కూల్చడం దారుణమన్నారు. అలాంటి గరీబోళ్లపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే, కోకాపేటలో ఎకరా వందల కోట్లతో అమ్మిన స్థలం పోగా, మిగిలిన స్థలంలో పేదలకు ఇళ్లు కట్టించి, వారి ఇండ్లను కూల్చాలన్నారు. ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి లాంటి వాళ్లకు ఇంకా రిజిస్ట్రేషన్ కాలేదనీ, అలాంటి వారి స్థలం వెనక్కి తీసుకుని, వాటిలో వీరందరికి వంద, రెండువందల్లో ఇళ్లు కట్టించాలన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలపై సకాలంలో ప్రభుత్వం స్పందించలేదన్నారు. దీని మూలంగానే వరద నష్టం, ప్రాణ నష్టం జరిగిందన్నారు. వర్షాలతో నష్టపోయిన రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వరదలకు ధ్వంసమైన రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, బిక్షపతి, వెంకట్‌గౌడ్, కుమార్, యాదగిరి, ప్రవీణ్ తదితరులున్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని మహిళ మృతి

- మరొకరికి తీవ్ర గాయాలు

పూడూరు, సెప్టెంబరు1: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందింది. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా పూడూరులో బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా బుదేరాకు చెందిన మన్నె రాంచంద్రయ్య, కూతురు లావణ్య(33), అల్లుడు కావలి వెంకటేశం బైక్‌పై వస్తున్నారు. పూడూరు గేటు వద్ద మరో ద్విచక్రవాహనం వీరి బైక్‌ను వేగంగా ఢీకొట్టింది. లావణ్య, వెంకటేశం కిందపడిపోయారు. లావణ్య తలకు బలమైన గాయం కావడంతో ఆమె అక్కడిక్కడే మృతిచెందింది. వెంకటేశం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

వర్షం వచ్చింది.. కష్టాలు తెచ్చింది

- మూడు రోజులుగా వానతో అవస్థలు
- కొట్టుకుపోయిన కల్వర్టులు, రోడ్లు
- నేలకూలిన ఇళ్లు, నీట మునిగిన పంట

చేర్యాల, సెప్టెంబరు 4: చేర్యాల మండలం తాడూరు క్రాస్‌రోడ్డు సమీపంలోని కల్వర్టు ఆవరణలో బీటీ రోడ్డు కుంగి ప్రమాదకరంగా మారింది. జనగామ- సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా కొద్దిరోజుల క్రితం కల్వర్టు నిర్మాణం పూర్తిచేసి బీటీ వేశారు. కానీ పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి కల్వర్టు కుంగింది. కుంగినరోడ్డు గుంత కనిపించక ప్రయాణికులు కల్వర్టు అంచు తగిలి వాహనాలు అదుపుతప్పుతుండటంతో భయాందోళనకు చెందుతున్నారు. కల్వర్టు నిర్మాణం పనుల్లో నిర్లక్ష్యం వహించడంతో కొన్నినెలలక్రితం కాశీగుడిశెలు చెందిన ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ విషయమై సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

● **దూళిమిట్ట:** మండలంలోని జాలపల్లి, కూటిగల్ గ్రామాల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కూలిన పలు ఇళ్లను తహసీల్దార్ ఎస్.మధుసూధన్, ఆర్ఐ రవీందర్ బుధవారం పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు 7 ఇళ్లు వర్షానికి కూలిపోయాయని, ఉన్నతాధికారులకు నివేదిక అందచేసి వారి ఆదేశాల మేరకు బాధితులకు సహాయం చేస్తామన్నారు. వారివెంట ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధుల ,తదితరులు ఉన్నారు. మండలంలోని బెక్కల్‌లో ప్రధాన రహదారికి సమీపంలో పెను ప్రమాదం తప్పింది. శివాలి తండాకు వెళ్లే 11 కేవీ లైన్ పోల్‌పై ఇన్సులేటర్ పగిలిపోవడంతో విద్యుత్ వైరు తెగి కింద పడి వేలాడాయి. గమనించిన స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం అందించారు. వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు సప్లై నిలిపివేసి మరమ్మతులు చేసి విద్యుత్తు సప్లైని పునరుద్ధరించారు. వెంటనే స్పందించి విద్యుత్తు సప్లైని పునరుద్ధరించిన లైన్‌మన్ కిషన్, జూనియర్ లైన్‌మన్ రమేష్, కట్టర్ యశ్వంత్‌ను గ్రామస్థులు అభినందించారు.

● **మర్కుక్:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి కస్తూర్బాగాంధీ మర్కుక్ పాఠశాల ఆవరణ నీటితో నిండి చెరువును తలపిస్తుంది. పాఠశాల ఎస్‌వో భాగ్యలక్ష్మి, ఎంఈవో ఉదయభాస్కర్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా బుధవారం ఉదయం జేసీబీ సాయంతో గోడకు రంధ్రం చేసి నీటిని బయటకు పంపించారు. సదరు కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్లే నీటి నిల్వలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడి ఎలాంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు.

● **హుస్నాబాద్‌రూరల్:** మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి వరదలు పారుతున్నాయి. పంట పొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. తోటపల్లి గ్రామంలో పిడుగుపాటుకు బంక మల్లవ్వకు చెందిన పాడిగేదె మృతి చెందింది. దీంతో రూ. 70 వేలు నష్టం వాటిల్లిందని ఆమె విలపించింది. వరద ప్రవాహానికి మహ్మదాపూర్‌లో లోతట్టు ఇళ్లలోకి వరద నీరు చేరి నిత్యావసర వస్తువులు దెబ్బతిన్నాయి. మహ్మదాపూర్-నాగారం ప్రధాన రహదారికి గండికొట్టి వరదను పొలాల్లోకి మళ్లించారు. దీంతో. ఇరు గ్రామాలకు వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. గండ్లు పడిన రోడ్లు, కల్వర్టులకు మరమ్మతులు చేయించాలని, దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

● **మద్దూరు:** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. మండలంలోని చెరువులు, కుంటలను స్థానిక ఎస్ఐ షేక్ మహబూబ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడారు. భారీ వర్షాలు కురుస్తున్నందున మండల ప్రజలు అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దన్నారు.



హుస్నాబాద్‌రూరల్: వరదలకు ఇసుక మేటలు వేసిన వరిపొలం



చేర్యాల: కుంగిన రోడ్డు



మర్కుక్: ఎక్స్‌కవేటర్‌తో రంధ్రం చేస్తున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి 'పొన్నం'

హుస్నాబాద్, సెప్టెంబరు 4: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. బుధవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పార్టీ శ్రేణులు ప్రజల్లో ఉండి సహాయక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఇది ప్రజాపాలన ప్రభుత్వం మీ అందరికి అండగా ఉంటుందన్నారు.

ఆగిఉన్న లారీని ఢీకొట్టిన కారు

- ఇద్దరికీ గాయాలు



లారీని ఢీకొట్టడంతో ధ్వంసమైన కారు

కొండపాక, సెప్టెంబరు 4: ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కొండపాక శివారు కొమురవెల్లి సమీపంలో రాజీవ్ రహదారిపై బుధవారం చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకానం.. హైదరాబాద్ వైపు నుంచి జగిత్యాలకు వెళ్తున్న కారు కొండపాక శివారులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న చంద్రశేఖర్, సౌమ్యలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

'ఒప్పంద ఉద్యోగులను తొలగించడం అన్యాయం'



మాట్లాడుతున్న పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 4: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో పనిచేస్తున్న ఒప్పంద ఉద్యోగులను తొలగించడం అన్యాయమని రాష్ట్ర గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సింహులు పేర్కొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒప్పంద ప్రాతిపదికన 5 నుంచి 6 సంవత్సరాలుగా నిజాయతీతో పని చేస్తూ, పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పాటును అందిస్తూ రెగ్యులర్ టీచర్స్‌తో సమానంగా పనిచేస్తున్నారని తెలిపారు. సుమారు 6 వేల మందికి మూడు నెలల నుంచి జీతాలు కూడా ఇవ్వడం లేదని, నేడు అర్థాంతరంగా వారిని విధుల నుంచి తొలగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తొలగించిన పార్ట్‌టైం ఉద్యోగులను తిరిగి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

హరీశ్‌రావు కాన్వాయ్‌పై దాడి సరికాదు

- ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి

గజ్వేల్, సెప్టెంబరు 4: ఖమ్మం పర్యటనలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాన్వాయ్‌పై కాంగ్రెస్ నాయకుల దాడి సరికాదని ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజలు కష్టాల్లో ఉన్నారని గుర్తించి పరామర్శకు వెళ్తే కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగడం సిగ్గు చేటన్నారు. ఖమ్మం బాధితుల కోసం నెల వేతనాన్ని విరాళంగా ప్రకటించారు.

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర మాజీ మంత్రుల కాన్వాయ్‌పై కాంగ్రెస్ గుండాల దాడి సిగ్గుచేటని రైతుబంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీ రవీందర్ పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలతో నష్టపోయిన ప్రజలకు నిత్యావసర సరుకులు అందిస్తూ, సహాయక చర్యల్లో పాల్గొన్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ కార్లపై కాంగ్రెస్ నాయకుల దాడి చేయడం సిగ్గు చేటన్నారు. కార్యక్రమంలో ఆయనవెంట కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, నాయకులు పంబాల శివకుమార్, మాజీ సర్పంచ్ దశరథం, కృష్ణ తదితరులున్నారు.



గజ్వేల్: మాట్లాడుతున్న దేవీ రవీందర్



జగదేవ్‌పూర్: మాట్లాడుతున్న నాయకులు

● **హుస్నాబాద్:** ఖమ్మంలో బీఆర్ఎస్ మాజీ మంత్రుల వాహనంపై కాంగ్రెస్‌కు చెందిన వారు దాడి చేయడం అమానుషమని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మంలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ తదితరుల వాహనాలపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

● **జగదేవ్‌పూర్:** ప్రజలకు సాయం చేయడం చేతగాక సాయం చేస్తున్న వాళ్లను చూసి ఓర్వలేక దాడి చేయడం సిగ్గుచేటు అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ.. ఖమ్మంలో జరిగిన దాడికి సీఎం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల పార్టీ నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల పరిసరాల్లో అపరిశుభ్రత ఉండొద్దు

- ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్



గజ్వేల్: కస్తూర్బా పాఠశాలను పరిశీలిస్తున్న ఆనంద్, త్రీమెన్ కమిటీ సభ్యులు

గజ్వేల్, సెప్టెంబరు 4: హాస్టళ్ల పరిసరాల్లో గడ్డి, అపరిశుభ్రతకు తావు ఇవ్వొద్దని ఎంహెచ్ఎన్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఆనంద్ సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన త్రీమెన్ కమిటీ(మునిసిపల్ కమిషనర్, తహసీల్దారు, వైద్యాధికారి)బృందంతో ఆయన గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముట్రాజ్‌పల్లిలోని కేజీబీవీ పాఠశాలను సందర్శించారు. పాఠశాల పరిసరాలను, వంటగదిని, వంట పాత్రలను, విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని, పాఠశాల పరిసరాల్లో గడ్డి, పిచ్చి మొక్కలు పెరగకుండా, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలన్నారు. పిల్లలతో వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ సమయానుకూలంగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వారితో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్, డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, పాఠశాల సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● **సిద్దిపేట టౌన్:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డుల్లో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, నాయకులు అడ్డగట్ల శేఖర్, అంజి, బందారం రాజు, అధికారులు అన్వేష్‌రెడ్డి, వనిత ఉన్నారు.

వల్లంపట్లలో మలేరియా, డెంగీ ర్యాపిడ్ టెస్టులు

మద్దూరు, సెప్టెంబరు 4: మండలంలోని రేబర్తిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వల్లంపట్లలో వైద్యాధికారి సువర్దనన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికి వెళ్లి మలేరియా, డెంగీ రాపిడ్ టెస్టులు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో టెస్టులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సులోచన, సూపర్‌వైజర్ రోస్లిన్, హెచ్‌ఏ దేవదాసు, ఏఎన్ఎం లలితతో పాటు ఆశాలు పాల్గొన్నారు.



సిద్దిపేట టౌన్: వార్డుల్లో పర్యటిస్తున్న సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలి

- సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్లయ్య



విలేకరులతో మాట్లాడుతున్న ఎల్లయ్య

గజ్వేల్, సెప్టెంబరు 4: ఎటువంటి షరతులు లేకుండా రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని ఐవోసీ వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతుల రుణమాఫీకి షరతులు తొలగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సిద్దిపేట జిల్లాలో ప్రాజెక్టుల అవసరాల కోసం ప్రభుత్వం వందలాది ఎకరాల భూమిని తీసుకున్నదన్నారు. భూములు కోల్పోయిన రైతులందరికీ పూర్తిస్థాయిలో రుణమాఫీ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆయనతో సీపీఎం నాయకులు ఎండీ. అహ్మద్, ఐలయ్య, అఫ్జల్ తదితరులున్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో స్వయం పరిపాలన



స్వయం పరిపాలన దినోత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు

వర్గల్, సెప్టెంబరు 4: వర్గల్ కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు నిర్వహించే పాత్రను విద్యార్థులు చక్కగా పోషించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రధాన అధ్యాపకులు భాస్కర్‌రావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిదన్నారు. అలాంటి ఉపాధ్యాయ వృత్తిని విద్యార్థి దశ నుంచే అలవరుచుకోవడం సంతోషకరమన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏటీపీ ఉమామహేశ్వరి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళా కళాశాల కార్యదర్శి గుండెపోటుతో మృతి

కొండపాక, సెప్టెంబరు 4: కొండపాకలోని శ్రీసత్యసాయి ప్రశాంతి నికేతన్ మహిళా కళాశాల కార్యదర్శి ఎం.శంకర్ బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతోడు చెందారు. శంకర్ కొన్ని సంవత్సరాల నుంచి ప్రశాంతి నికేతన్ కళాశాల కార్యదర్శిగా పనిచేస్తున్నారు.

విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ

కొండపాక, సెప్టెంబరు 4: సిద్దిపేట వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం నోటుబుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో దుద్దెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీ, వాసవీ క్లబ్, యూత్ క్లబ్ అధ్యక్షులు ఆర్వేపల్లి హరికిరణ్, చకిలం రవి , గంప కృష్ణమూర్తి తదితరులున్నారు.

కరాటే శిక్షకుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 4: రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షా ప్రశిక్షణ్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని విద్యార్థినులకు కరాటే శిక్షణ ఇవ్వడానికి నైపుణ్యం, ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 3 నెలల పాటు ఇచ్చే శిక్షణకు దరఖాస్తు చేసుకునేవారు బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ ప్రతిని జత చేయాలన్నారు. సిద్దిపేట జిల్లావాసులై ఉండాలని, మహిళా అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 11వ తేది మధ్యాహ్నం 2గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు

అతిథి అధ్యాపక పోస్టులకు..

గజ్వేల్, సెప్టెంబరు 4: గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ఆయా సబెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నిఖత్ అంజుమ్ పేర్కొన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌లోని కళాశాలలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కళాశాలలో ఆంగ్లం-1, కంప్యూటర్ సైన్స్-1, కామర్స్-1 సబెక్టుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు పీజీ కోర్సుల్లో 55శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు అయితే 50శాతం మార్కులు ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన అభ్యర్థులు సెప్టెంబర్ 6వ తేదీ లోపు కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని 9న కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్ల ఎంపిక



ఎంపికైన ఎన్‌సీసీ కేడెట్లు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 4: ఈ సంవత్సరం శిక్షణకు గాను 60 మంది ఎన్‌సీసీ కేడెట్లను ఎంపిక చేసినట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి. సునీత తెలిపారు. కరీంనగర్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ డానియల్ లొట్టెం అధ్వర్యంలో బెటాలియన్ శిక్షణ అధికారులు సుబేదార్ సూర్యప్రసాద్, హవల్దార్ గులాబ్‌సింగ్ పర్యవేక్షణలో బుధవారం డిగ్రీ కళాశాల మైదానంలో ఎంపికలు జరిగాయి. 150 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ ఎంపికల్లో వారి ఎత్తు, బరువు, శారీరక దారుఢ్యం, క్రీడా సామర్థ్యం వంటి నైపుణ్యాల ఆధారంగా 24 మంది విద్యార్థినులను 36 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ షేక్ మహబూబ్

మద్దూరు, సెప్టెంబరు 4: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ మహబూబ్ సూచించారు. మండల కేంద్రంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే స్పందించ వద్దన్నారు. మీ కుటుంబసభ్యులు కేసులో ఇరుక్కున్నారని వచ్చే కాల్స్‌ను నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించిన 'బండి'



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న బీజేపీ నాయకులు

బెజ్జంకి, సెప్టెంబరు 4: మండలంలోని తోటపల్లికి చెందిన సంధిరి లక్ష్మణ్ చేపల వేటకు వెళ్లి గల్లంతై మృతి చెందాడు. ఈ విషయాన్ని బీజేపీ నాయకులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ దృష్టికి తీసుకుపోవడంతో బుధవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మృతుడి కుటుంబసభ్యులను ఫోన్‌లో పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు 25 వేల ఆర్థిక సహాయాన్ని అందజేయాలని పార్టీ నాయకులకు సూచించడంతో బీజేపీ పార్టీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కొలిపాక రాజు మృతుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

'కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయాలి'

గజ్వేల్, సెప్టెంబరు 4: పేద ప్రజలకు ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మంజూరు చేసి పంపిణీ చేయాలని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంవత్సర కాలంలో పెళ్లిళ్లు అయి కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే నిధులను మంజూరు చేసి, చెక్కులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

పీజీఆర్ఆర్ దూరవిద్య సమన్వయకర్తగా శ్రీనివాస్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 4: ప్రొఫెసర్ జి. రాంరెడ్డి దూరవిద్య సిద్దిపేట కేంద్ర సమన్వయకర్తగా టి. శ్రీనివాస్‌ను నియమించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ ప్రొఫెసర్ జి. రాంరెడ్డి దూరవిద్య సిద్దిపేట కేంద్ర సమన్వయకర్తగా అదనపు బాధ్యతలు నిర్వర్తించనున్నారు. అనంతరం పీజీఆర్ఆర్ దూర విద్య అడ్మిషన్స్ వాల్‌పోస్టర్‌ను డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సునీత చేతులమీదుగా విడుదల చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సీహెచ్. మధుసూదన్, గోపాల సుదర్శనం, ఎం. శ్రద్ధానందం కె. విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చేర్యాల/సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 4: కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు అందె వీరేశం ఇటీవల మృతి చెందాడు. కొమురవెల్లి వీరశైవ లింగాయత్ సమాజం తరఫున రూ.20వేల ఆర్థికసహాయాన్ని బుధవారం అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్ తదితరులు బుధవారం మృతుడి కుటుంబానకి నగదు అందించారు. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరుకు చెందిన బలరాం సిద్దిపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తూ ఆకస్మిక మృతి చెందడంతో అతని కుటుంబానికి తోటి ఉద్యోగస్థులు రూ. 43 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

మండపాల నిర్వాహకులు సహకరించాలి

- చెరువుల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలి
- సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 4: వినాయక చవితి సందర్భంగా మండలపాల కమిటీ నిర్వాహకులు మున్సిపల్, పోలీసు, విద్యుత్ అధికారులు సూచించే జాగ్రత్తలు తప్పక పాటిస్తూ, అధికారులకు సహకరించాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు కోరారు. సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వినాయక చవితి సందర్భంగా సిద్దిపేట పట్టణంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, ఏసీపీ మధు, మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాకపోకలకు అంతరాయం కలగకుండా రోడ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయరాదని సూచించారు. చెరువుల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఏసీపీ మధును కోరారు. ఏసీపీ మధు మాట్లాడుతూ.. పట్టణంలో వినాయక నిమజ్జనం మూడు రోజులు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈనెల 16న మిలాద్ ఉన్ నబీ సందర్భంగా ప్రార్థనల అనంతరం 17న చేపట్టవలసిన జూలూస్ కార్యక్రమాన్ని 19న నిర్వహించాలని మత పెద్దలకు చెప్పగా వారు అంగీకరించారన్నారు. కార్యక్రమంలో పట్టణ సీఐలు లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ డీఈ ప్రేరణ, ఏఈ అన్వేష్‌రెడ్డి, విద్యుత్ ఏఈ రమేష్, అగ్నిమాపక అధికారులు, ఎక్సైజ్ అధికారులు, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, వనిత, మాధవి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట క్రైం:** భిన్నత్వంలో ఏకత్వం మన దేశ ప్రత్యేకత అని, అందరూ కలిసి ప్రశాంతంగా పండుగలను జరుపుకోవాలని సిద్దిపేట ఏసీపీ మధు సూచించారు. వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ సందర్భంగా బుధవారం ముస్లిం పెద్దలతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. కులం, మతం, వర్గం అనే బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసిగా ఉండడం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో తంజీమ్ ప్రెసిడెంట్ కార్యవర్గ సభ్యులు ముస్లిం పెద్దలు మమ్మద్ మునీర్, మహమ్మద్ రియాజుద్దీన్, అబ్దుల్ మోయిజ్, మహమ్మద్ గౌస్, సలీం, వజీర్, రియాజ్, అబ్దుల్ రహీం, మిలాద్ ఉన్ నబీ కమిటీ మెంబర్లు, మజీద్ ఇమామ్లు, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీబాబు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్, త్రీటౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● **గజ్వేల్:** పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డి సూచించారు. గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్‌లను ఉదయం 6గంటల నుంచి రాత్రి 10గంటల వరకే వాడాలని సూచించారు. వారి వెంట గజ్వేల్ సీఐ సైదా, ఎలక్ట్రిసిటీ ఏఈ మారుతి, ఎస్ఐలు శంకర్, యాదగిరిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ భార్గవ్ ఉన్నారు.

● **తొగుట/రాయపోల్:** శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఊరుకునేది లేదని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. తొగుట వ్యవసాయ మార్కెట్ యార్డులో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎస్ఐ రవికాంత్‌రావు ఆధ్వర్యంలో గణేశ్ మండపాల నిర్వాహకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్ఐ అశోక్ రాజ్, హెడ్ కానిస్టేబుల్ అనిల్, పోలీస్ సిబ్బంది మరియు నిర్వాహకులు పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను జరుపుకోవాలని తొగుట సీఐ లతీఫ్ సూచించారు. రాయపోల్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో సీఐ లతీఫ్ మాట్లాడారు. సమావేశంలో తహసీల్దార్ దివ్య, ఎస్ఐ రఘుపతి, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● **మిరుదొడ్డి:** వినాయకుడి ఉత్సవాలకు తప్పనిసరిగా మండప నిర్వహకులు పోలీస్‌శాఖ అనుమతిని తీసుకోవాలని మిరుదొడ్డి ఎస్ఐ పరుశురాములు సూచించారు.



సిద్దిపేట టౌన్: కోమటిచెరువు నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వాహనాలకు పార్కింగ్‌గా ప్రయాణ ప్రాంగణం

- బస్సులు రాకపోవడంతో నిరుపయోగంగా బస్టాండ్
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు



బస్టాండ్‌లో నిలిపిన వాహనాలు

వర్గల్, సెప్టెంబరు 4: వర్గల్ మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన ప్రయాణ ప్రాంగణం నేడు వాహనాలకు పార్కింగ్ ప్రదేశంగా ఉపయోగపడుతుంది. ప్రయాణ ప్రాంగణంలోకి బస్సులు రాకపోవడం, బస్సులు రావని తెలిసి ప్రయాణికులూ రాకపోవడంతో స్థానికులు వాహనాలను పార్కింగ్ చేసకోవడానికి వాడుకుంటున్నారు. వర్గల్ మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం ద్వారా రూ. 50 లక్షల వ్యయంతో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలో నాలుగు సంవత్సరాల క్రితం ప్రయాణ ప్రాంగణాన్ని నిర్మించారు. ప్రయాణ ప్రాంగణం నిర్మించిన తర్వాత కొద్ది రోజులు మాత్రమే అందులోకి బస్సులు వచ్చాయి. ఆ తర్వాత ఆటు వైపు బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు ప్రయాణ ప్రాంగణానికి రావడం మానేశారు. దీంతో స్థానికులు వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ప్రారంభోత్సవం అయిన నాటి నుంచి ప్రయాణ ప్రాంగణం నిర్వహణకు ఆర్టీసీ అధికారులు ఎవరిని నియమించకపోవడంతో ప్రస్తుతం చెత్త చెదారంతో కప్పు కొదుతున్నది. ప్రయాణ ప్రాగణాన్ని వినియోగంలోకి తేవాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రయాణ ప్రాంగణాన్ని వినియోగంలోకి తెచ్చి బస్సులు వచ్చే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



చేర్యాల మండలం తాడూరు గ్రామ శివారులో వాగు ఉధృతంగా ప్రవహిస్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన స్కూల్ విద్యార్థులను చేర్యాల పోలీస్ కానిస్టేబుల్ బి. హన్మంతు జాగ్రత్తగా వాగు దాటించాడు.

- చేర్యాల